www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 28 జూన్ 2025

5

ఏలూరు

కొనసాగిన డిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెగా డిఎస్‌సి-2025 పరీక్షలు శుక్రవారం ఏలూరులో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో వంద మందికి 74 మంది హాజరు కాగా 26 మంది గైర్హాజరయ్యారు. సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 204 మందికి 173 మంది హాజరు కాగా 31 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష జరగలేదు. మొత్తం రెండు కేంద్రాల్లో 304 మందికి 247 మంది హాజరు కాగా 57 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఐదు గంటల వరకు జరిగిన పరీక్షలకు సిద్ధార్థ క్వెస్ట్‌లో వంద మందికి 81 మంది హాజరు కాగా 19 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష జరగలేదు. సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 205 మందికి 175 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరయ్యారు. మొత్తం రెండు కేంద్రాల్లో 305 మందికి 256 మంది హాజరు కాగా 49 మంది గైర్హాజరయ్యారు.

ఆఖరులో హడావుడి..!

మూడు రోజుల్లో ముగియనున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు

హడావుడిగా ఉద్యోగులను పిలిచి తూతూమంత్రంగా ప్రక్రియ

ఇప్పటికే నేతలు చెప్పినట్లు బదిలీల జాబితా సిద్ధం చేసినట్లు ప్రచారం

గ్రేడ్-5, 6 సచివాలయ కార్యదర్శులను పిలిచి ఆప్షనల్ ఫారం స్వీకరణ

నేడు, రేపు మరిన్ని శాఖల ఉద్యోగులకు జిల్లా కేంద్రానికి పిలుపు

డిఎస్‌సి పరీక్షల నేపథ్యంలో ఉద్యోగులు సతమతం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో ఏమాత్రం పారదర్శకత లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు పూర్తిగా రాజకీయ నాయకుల కనుసన్నల్లో సాగుతోంది. దీంతో ఉద్యోగులకు అసలు ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే రాజకీయ నాయకులు చెప్పినట్లు బదిలీల జాబితాలు తయారైపోయాయని, ఇప్పుడు జరుగుతున్న తతంగమంతా తూతూమంత్రమే అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీకి సంబంధించిన ఉత్తర్వులు వెలువడి దాదాపు 20 రోజులు కావొస్తున్నా పట్టించుకోని ఆయా శాఖల అధికారులు, మూడు రోజుల్లో గడువు ముగుస్తుందనగా హడావుడి చేస్తున్న పరిస్థితి ఉంది. దీంతో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలపై తీవ్ర విమర్శలు నెలకొన్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 1100 వరకూ గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. 8,500 మంది వరకూ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఐదేళ్లు పూర్తయిన ప్రతి సచివాలయ ఉద్యోగీ బదిలీ కావాల్సిందేనని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మూడొంతులు మంది



ఆప్షన్లు ఇచ్చేందుకు ఏలూరు జిల్లాపరిషత్ సమావేశం హాలుకు వచ్చిన గ్రేడ్-5,6 కార్యదర్శులు

ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరిగా మారింది. ఈ నెల 12న బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటి వరకూ బదిలీల ప్రక్రియను అధికారులు ప్రారంభించలేదు. మరో మూడు రోజుల్లో గడువు ముగుస్తుందనగా ఇప్పుడు సచివాలయ ఉద్యోగులను జిల్లా కేంద్రానికి పిలిచి హడావుడి చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ నెల 27న శుక్రవారం సచివాలయాల్లోని గ్రేడ్-5, 6 కార్యదర్శులకు ఏలూరు జిల్లా పరిషత్ సమావేశపు హాలులో బదిలీల ప్రక్రియ ప్రారంభించారు. దీంతో గ్రేడ్-5 కార్యదర్శులు 88 మంది, గ్రేడ్-6 కార్యదర్శులు 304 మంది తరలొచ్చారు. డిపిఒ కె.అనురాధ ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు ఉద్యోగుల నుంచి ఆప్షన్ ఫారాలు తీసుకున్నారు. ఉద్యోగులకు ఒక ఫారం ఇచ్చి అందులో ఉద్యోగి వివరాలతోపాటు, మూడు స్థానాలకు సంబంధించి ఆప్షన్లు రాయించి తీసుకున్నారు. 28వ తేదీ శనివారం ఇంజినీరింగ్, సర్వేయర్ ఉద్యోగులను, 29న ఆదివారం వెల్ఫేర్ ఉద్యోగులను సైతం ఏలూరు రావాలని పిలిచినట్లు తెలుస్తోంది. మహిళా పోలీసులు, అగ్రికల్చర్, ఫిషరీస్ అసిస్టెంట్లకు సంబంధించి ఇంకా పిలుపు రాలేదని తెలిసింది. శుక్రవారం రాత్రి, లేదా శనివారం వారికీ పిలుపు రావొచ్చని తెలుస్తోంది. మరోపక్క డిఎస్‌సి పరీక్షలు జరుగుతున్నాయి. వచ్చే నెల రెండో తేదీ వరకూ పరీక్షలు జరగనున్నాయి. ఎంతోమంది సచివాలయ ఉద్యోగులు ఈ పరీక్ష రాస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బదిలీల పిలుపు రావడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు ఇస్తున్న ఆప్షనల్ ఫారాల ఆధారంగా బదిలీలు జరుగుతాయా.. లేక రాజకీయ నాయకులు చెప్పినట్లు జరుగుతాయా అని ఉద్యోగుల్లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది.

ఇప్పటికే బదిలీల జాబితా సిద్ధం..?

సచివాలయ ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులు వెలువడగానే గతంలో ఎన్నడూ లేనివిధంగా గందరగోళం నెలకొంది. గ్రామంలోని అధికార పార్టీ నాయకునితో అనుమతిపత్రం తెచ్చుకుంటే.. ఎంఎల్‌ఎ లేఖ ఇస్తారని, అందుకు అనుగుణంగా బదిలీలు ఉంటాయని నాయకులు తెలిపారు. దీంతో సచివాలయ ఉద్యోగులంతా అధికార పార్టీ నాయకులు, ఎంఎల్‌ఎ కార్యాలయాలకు క్యూ కట్టిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లోని రాజకీయ నాయకుల అనుమతి పత్రాలు తీసుకుని ఎంఎల్‌ఎ కార్యాలయాలకు సమర్పించారు. ఎంఎల్‌ఎల నుంచి సంబంధిత లేఖలు ఆయా శాఖల ఉన్నతాధికారుల కార్యాలయాలకు చేరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాజకీయ నాయకుల లేఖల ఆధారంగా బదిలీల జాబితా తయారైపోయిందని, అధికారులు చేస్తున్న ఆప్షనల్ ప్రక్రియ హడావుడంతా వట్టి బూటకమనే విమర్శలు విన్పిస్తున్నాయి. కొన్నిచోట్ల సచివాలయాల ఉద్యోగుల నుంచి రాజకీయ నాయకులు సొమ్ము కూడా వసూలు చేసినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను అత్యంత దారుణంగా మార్చారనే చర్చ ఉద్యోగుల్లో నెలకొంది. వికలాంగులు, స్పౌజ్ కేటగిరీలకు సంబంధించిన నిబంధనలు పరిగణనలోకి తీసుకుంటారా.. ఏకపక్షంగా రాజకీయ నాయకులు చెప్పినట్లు బదిలీలు చేసేస్తారా అనేది తేలాల్సి ఉంది. రేషనలైజేషన్ చేయకుండా బదిలీల ప్రక్రియ జరుగుతుండటంతో తీవ్ర గందరగోళం నెలకొంది. కూటమి ప్రభుత్వం బదిలీల వ్యవహారంలో ఏమాత్రం పారదర్శకత పాటించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ఘొల్లుమన్న చినరవ్వవారిగూడెం

వాగులో మునిగి ముగ్గురు యువకుల దుర్మరణం

అన్నదమ్ముల మృతితో తల్లడిల్లిన తల్లిదండ్రులు

ఏకైక కుమారుడు దూరమయ్యాడని భోరున విలపించిన టిడిపి నేత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీలోని చినరవ్వవారిగూడెం శోక సంద్రమైంది. గ్రామానికి చెందిన ముగ్గురు యువకుల దుర్మరణంతో తల్లడిల్లింది. వాగుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడమే ఈ ప్రమాదాలకు కారణమనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

అచ్చియ్యపాలెం పంచాయతీ పరిధిలోని చినరవ్వవారిగూడెం గ్రామానికి చెందిన తెల్లం సీతారాముడు (30), తెల్లం కిషోర్ (26), మడి దేవేంద్రకుమార్ (18), తెల్లం అరుణ్, సున్నం శివరామ్‌తేజ శుక్రవారం మధ్యాహ్నం సరదాగా ఈతకొట్టి స్నానం చేసేందుకు మంగయ్యపాలెం పంచాయతీలోని దండిపూడి గ్రామ సమీపంలోని బొల్లకొండవాగులోకి దిగారు. అయితే లోతుపై అంచనా లేకో, మరే ఇతర కారణమోగాని సీతారాముడు, కిషోర్, దేవేంద్ర నీట మునిగారు. ఇది గమనించిన అరుణ్, శివరామ్‌తేజ ఒడ్డుకు చేరుకుని స్థానికులకు చెప్పారు. స్థానికుల సమాచారంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం సాయంత్రం ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తల్లడిల్లిన చినరవ్వవారిగూడెం

గ్రామానికి చెందిన ముగ్గురు యువకుల

యువకుల మృతదేహాలు

మృతి వార్త తెలిసిన చినరవ్వారిగూడెంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. తెల్లం సీతారాముడు, కిషోర్ స్వయానా అన్నదమ్ములు. సీతారాముడికి భార్య, ఒక కుమార్తె ఉండగా ప్రస్తుతం భార్య గర్భిణి. ఇక కిషోర్ డిగ్రీ పూర్తి చేశారు. వీరి తండ్రి తెల్లం పోసిరావు ఉపాధ్యాయునిగా పని చేస్తూ అస్వస్థతకు గురై ఇటీవలే కోలుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరు కుమారులూ మృతి చెందడంతో పోసిరావు కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. ఇక మడి దేవేంద్రకుమార్ ఇంటర్ పూర్తి చేసి ఇంజినీరింగ్‌లో చేరేందుకు వేచి ఉన్నాడు. ఈయన టిడిపి అచ్చియ్యపాలెం గ్రామాధ్యక్షుడు మడి సోమరాజు ఏకైక కుమారుడు. ఏకైక సంతానం కోల్పోయిన సోమరాజు కుటుంబం భోరున విలపిస్తోంది. బాధిత కుటుంబాలను ఎపి ట్రైకార్ ఛైర్మన్ బోరగం శ్రీనివాసులు పరామర్శించారు.

సిడిపిఒలు, ఎంఇఒలు సమన్వయంతో పని చేయాలి

అంగన్వాడీల్లో ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయాలి : కలెక్టర్

ఏలూరు :అంగన్వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేసేందుకు సిడిపిఒలు, ఎంఇఒలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు, విద్యా శాఖాధికారులు, ఐసిడిఎస్ అధికా రులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీరో నమోదు ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అంగన్వాడీ కేంద్రాల్లోని ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హేబిటేషన్‌లో పిల్లలు లేరని పేర్కొన్న ఎంఇఒలు, సిడిపిఒలు, హేబిటేషన్‌లో పిల్లలు లేరని ధ్రువీకరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ పి.శారద, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, డివైఇఒలు, ఎంఇఒలు, ఐసిడిఎస్ సిడిపిఒలు పాల్గొన్నారు.

జాతీయ రహదారి సర్వీసు రోడ్డు రాస్తారోకో చేస్తున్న రైతులు

పొలాలకు వెళ్లే మార్గం మూసేయడంపై రాస్తారోకో

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పొలాలకు వెళ్లే మార్గం లేకుండా సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టి, పొలాలకు వెళ్లే మార్గం మూసివేయడాన్ని నిరసిస్తూ రైతులు పుట్లగట్లగూడెంలోని జాతీయ రహదారి సర్వీసు రోడ్డు వద్ద శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్డు పక్క నుంచి పొలాలకు వెళ్లే దారి ఇస్తామని చెప్పి, ఇవ్వకుండా సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టారని, పైగా పొలాలకు వెళ్లే దారి మూసివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కొంగల చెరువు సర్‌ప్లస్ వాటర్ దిగువ ప్రాంతాలకు వెళ్లేకాల్వను సైతం పూడ్చి వేయడంతో వరద నీరు వెళ్లే మార్గం లేక పొలాలు నీట మునుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు అర్జీలు పెట్టినా పట్టించుకున్న దాఖలాల్లేవని వాపోయారు. ఎంపీ, ఎంఎల్‌ఎ జోక్యం చేసుకుని తమ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గొల్లపూడి శ్రీనివాసరావు, శీలం వెంకటరాజు, బొచ్చు శ్రీను, పళ్ల సత్యనారాయణ, వాంశెట్టి ప్రసాద్, శీలం రామచంద్రరావు, గుర్రం సుబ్బన్న, గుర్రం మంగరాజు, గంగుల గంగాధర్, ఆనం కృష్ణ, వామిశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ

మోడీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఉందా?

కాంగ్రెస్ వస్తేనే రాష్ట్ర అభివృద్ధి

ఏలూరులో పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దేశంలో గత పదకొండు సంవత్సరాలుగా అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందని పిసిసి అధ్యక్షురాలు వైఎస్. షర్మిలారెడ్డి విమర్శించారు. ఏలూరులోని నేరెళ్ల రాజా కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ ఎమర్జెన్సీ మీద మోడీ నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని, ఆ ఎమర్జెన్సీ కంటే ప్రస్తుత అప్రకటిత ఎమర్జెన్సీతో దేశంలో మొత్తం వ్యవస్థలన్నింటినీ నాశనం చేశారని అన్నారు. గోద్రా, మణిపూర్ ఘటనలకు ఎవరు కారణమని ప్రశ్నించారు. నేటి వరకు ప్రధాని మోడీ మణిపూర్ వెళ్లలేదని, బిజెపి మతం పేరుతో చిచ్చు పెడుతుందని, మంటలు పెట్టి చలి కాచుకుంటుందని, ఇది ఎమర్జెన్సీ కాదా అని ప్రశ్నించారు. దేశ సంపదను అదానీ, అంబానీకి దోచిపెడుతున్నారని విమర్శించారు. ఇడి, సిబిఐ, ఐటీ, ఎన్నికల సంఘం అన్నీ బిజెపి గుప్పెట్లోనే ఉన్నాయని, ఎవరినీ స్వేచ్ఛగా మాట్లాడినవ్వట్లేదని, ఒకవేళ మాట్లాడితే అక్రమ కేసులు పెట్టి ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని అన్నారు. వైసిపి, బిఆర్‌ఎస్ లాంటి పార్టీలు కూడా కేసులకు భయపడి మోడీ గుప్పెట్లోకి

మాట్లాడుతున్న షర్మిల

వెళ్లాయని, మీడియాను కూడా గుప్పెట్లో పెట్టుకున్నారని, ఇది కాదా ఎమర్జెన్సీ అని అన్నారు.

కాంగ్రెస్ బలోపేతంతోనే రాష్ట్రానికి మేలు

పదకొండేళ్లుగా మోడీ ప్రధానిగా ఉండి విభజన హామీలను నెరవేర్చలేదని, విభజన హామీలు నెరవేరాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని షర్మిల అన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలన్నారు. బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసగించిందని, పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి అన్యాయం చేస్తుందని అన్నారు. టిడిపి, వైసిపి, జనసేన ఎంపీలకు దమ్ము లేదని అన్నారు. అధికార, ప్రతిపక్షమనే తేడా లేకుండా మూడు పార్టీలూ మోడీకి తొత్తులుగా మారి పని చేస్తున్నాయన్నారు. విభజన చట్టంలో రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వాలని ఉందని, నిధులకు బదులు ఇప్పుడు అప్పులిస్తూ రాష్ట్రం నెత్తిన భారం మోపుతున్నారని అన్నారు. బిజెపి ఇంత అన్యాయం చేస్తుంటే చంద్రబాబు, పవన్ కూటమి కట్టి మోడీ అన్యాయాన్ని ప్రశ్నించకుండా దాసోహం అంటున్నారన్నారు. మోడీకి యోగా మీద ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రజల మీద లేదని మండిపడ్డారు. బనకచర్ల మీద రాష్ట్ర ప్రయోజనాలే తమ స్టాండ్‌ని, అన్ని పార్టీలతో కలిసి నీటి హక్కుల కోసం పోరాడతామని అన్నారు. వైసిపి కార్ల కింద జనాలను తొక్కి చంపుతున్నా పర్యటనలకు అనుమతులు ఇస్తారని, తాము పోరాటాలు చేస్తే హౌస్ అరెస్టు చేస్తున్నారని అన్నారు. వివేక హత్య మీద మాట మార్చారని, న్యాయానికి చోటు ఉందా లేదా అనే సందేహం వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు ఉన్నమట్ల ఎలిజా, ఆలపాటి నరసింహమూర్తి, మరీదు కృష, కాంగ్రెస్ నాయకురాలు కావూరి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం వంతెనకు తాత్కాలిక మరమ్మతులు

బ్రిడ్జికి రూ.20 లక్షలు, అప్రోచ్ రోడ్డుకు రూ.60 లక్షలకు ప్రతిపాదనలు

బ్రిడ్జిని పరిశీలించిన ఆర్‌అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు కాలువపై నారాయణపురం వద్ద ఆర్‌అండ్‌బి బ్రిడ్జి శిథిలావస్థకు చేరి మూతపడింది. ఈ బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు ఆర్‌అండ్‌బి అధికారులు ప్రతిపాదనలు తయారుచేసేందుకు శుక్రవారం ఆర్‌అండ్‌బి, రెవెన్యూ శాఖ అధికారుల బృందం వంతెనను పరిశీలించారు. వంతెన మూతపడిన 13 రోజులకు వివిధ శాఖల అధికారుల బృందం వంతెనను చూడడం గమనార్హం. ఈ నెల 15వ తేదీన వంతెన స్లాబుకు రంధ్రం పడిన విషయాన్ని తొలుత ప్రజాశక్తి పోలీసు శాఖకు సమాచారం ఇవ్వడంతోనే వెలుగులోకి వచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే.

వంతెనను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బి అధికారులు

జాతీయ రహదారిని కలుపుతూ నాలుగు జిల్లాలకు ముఖ ద్వారంగా ఉన్న ఈ వంతెన స్థానంలో కొత్తది నిర్మించాలంటే రూ.8.50 కోట్లు పైనే నిధులు కావాల్సి ఉంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇప్పట్లో నిధులు మంజూరయ్యేలా కనిపించడం లేదు. దీంతో తాత్కాలికంగా వంతెనపై తారు (డెక్) లేయర్‌ను పూర్తిగా తొలగించి దానిపై ఐరన్ గెడ్డర్లు, మందపాటి ఇనుప షీట్‌తో బెయిలీ వంతెన తరహాలో నిర్మించేందుకు సాధ్యా అసాధ్యాలు, సాంకేతిక అంశాలు, ప్రస్తుత వంతెన పిల్లర్ల పటిష్టత తదితర విషయాలను అధికారుల బృందం క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. ఆటోలు, కారులు, స్కూలు వ్యాన్లు వంటి తేలికపాటి వాహనాలు మాత్రమే వంతెన మీదుగా వెళ్లేలా మరమ్మతులు చేయాల్సిందిగా వ్యక్తిగత పనిమీద విదేశాల్లో ఉన్న ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు ఆదేశాల మేరకు అధికారులు వచ్చినట్లు క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు వెల్లడించారు. పోలీసు స్టేషన్ నుంచి కాలువ గట్టు రోడ్డును విస్తరించేందుకు రూ.60 లక్షలు, వంతెన మరమ్మతులకు రూ.20 లక్షలకు ప్రతిపా దనలు సిద్ధం చేస్తున్నామని ఎఇ భాస్కరరావు ప్రజాశక్తికి వెల్లడించారు. ఆర్‌అండ్‌బి ఇఇ కిషోర్‌బాపూజీ, డిఇ గోవింద మోహన్, ఎఇ భాస్కరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కె.రామారావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ పూర్ణ, ఆర్‌ఐ కె.లక్ష్మీనారాయణ, ఆర్‌అండ్‌బి సిబ్బంది పాల్గొన్నారు.

కోకో గింజలు పూర్తిగా కొనుగోలు చేయాలి

అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చేలా ఫార్ములా రూపొందించాలి

విజయరాయిలో ఎపి కోకో రైతుసంఘం ఆధ్వర్యాన నిరసన

ఆందోళన చేస్తున్న కోకో రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి - పెదవేగి

కోకో రైతుల వద్ద ఉన్న గింజలు పూర్తిగా కొనుగోలు చేయాలని, ప్రభుత్వ ప్రోత్సాహంతో కలిపి టార్గెట్లతో నిమిత్తం లేకుండా జులై 15 వరకు కంపెనీలు కోకో గింజలు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం డిమాండ్ ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. శుక్రవారం సాయంత్రం విజయరాయి గాంధీనగర్‌లోని శ్రీ సీతారామ కళ్యాణ మండపం హాలులో ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన కోకో రైతుల సమావేశం నిర్వహించారు. తొలుత కోకో గింజల కొనుగోలు సమస్యలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో గింజల కొనుగోలులో రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని కోరారు. జిల్లాలో అనేకచోట్ల రైతులు దరఖాస్తులు ఇచ్చినా కంపెనీలు గింజలు కొనుగోలు చేయడం లేదన్నారు. కొన్ని రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తులు తీసుకోవడం లేదన్నారు. కోకో రైతులందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.

ఆయిల్‌పామ్ రైతుల ఆందోళనకు సంఘీభావం

పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగారం ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పామాయిల్ రైతులు చేస్తున్న పోరాటానికి ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం తరపున సంఘీభావం ప్రకటించారు. ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రయివేటీకరణ ఆలోచన విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజయరాయి ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి, కోకో రైతు సంఘం నాయకులు పాలడుగు నరసింహారావు, గుదిబండి వీరారెడ్డి, కోనేరు సతీష్‌బాబు, రాపర్ల తేజకృష్ణ, ఆలపాటి వాసు, వై.శ్రీనివాసరాజు, బొప్పన మునీశ్వరరావు, బింగి శ్రీను, పావులూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మా స్కూల్ మాకే కావాలి

కొనసాగిన కోడూరు విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి- ముదినేపల్లి

కోడూరు యుపి పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు శుక్రవారం కూడా నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల వద్ద మా స్కూలు మాకే కావాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి నినాదాలు చేస్తూ నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏకపక్ష ధోరణి వీడాలన్నారు. మండల విద్యా శాఖాధికారులు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండా యుపి పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చేందుకు ఏకపక్షంగా నిర్ణయం చేయడం దారుణమన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ పాఠశాలలో 6, 7, 8వ తరగతి విద్యార్థులు మొత్తం 20 మంది ప్రతిరోజూ పాఠశాలకు నేటికి వస్తూనే ఉన్నారన్నారు. 6, 7, 8 తరగతులు కొనసాగించాలా లేదా, అనేది విద్యాశాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు నేటికీ రాలేదన్నారు. తమ పిల్లలను పాఠశాలనైనా మానిపిస్తంగాని పది కిలోమీటర్ల దూరంలో ఉన్న హై స్కూల్‌కు పంపలేమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మండల విద్యాశాఖాధికారి నరేష్ కుమార్‌ను వివరణ కోరగా కోడూరు యుపి

నిరసన తెలుపుతున్న కోడూరు విద్యార్థులు

స్కూల్‌ను కొనసాగించేది, లేనిది తన పరిధిలో లేదన్నారు. ఇప్పటికే కోడూరు స్కూల్‌కు సంబంధించిన ఫైల్‌ను జిల్లా విద్యాశాఖాధికారిణి కలెక్టర్‌కు అందించినట్లు తెలిపారు. ఈ స్కూల్ ఫైల్ కలెక్టర్ వద్ద ఉందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ వెంటనే స్పందించి కోడూరు యుపి పాఠశాలను యథాతథంగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బస్టాండ్ల పునరుద్ధరణ, ఆధునికీకరణకు ప్రణాళికలు

జిల్లా ప్రజా రవాణా అధికారి షబ్నం

నూజివీడు బస్టాండ్, గ్యారేజ్ పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జిల్లా పరిధిలోని అన్ని ఆర్‌టిసి బస్టాండ్లను పరిశీలించి బస్టాండ్ల పునరుద్ధరణ, ఆధునీకరణ కోసం ప్రణాళికలు రచించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి షబ్నం తెలిపారు. పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్, గ్యారేజ్‌లను శుక్రవారం ఆమె పరిశీలించారు. నూజివీడు ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రధానంగా తాగునీరు, మరుగుదొడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆమె దృష్టికి వచ్చింది. దీనిపై ఆమె మాట్లాడుతూ అన్ని సమస్యలపై నివేదిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా వర్షం వచ్చిన సమయంలో పల్లంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండులోకి వర్షపు నీరు చేరడంతో డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళన కోసం శాశ్వత ప్రణాళిక

బస్టాండ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి

రూపొందించనున్నట్లు చెప్పారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆయా సంఘాల నాయకులు, కార్మికులతో చర్చలు నిర్వహించి సకాలంలో పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోనున్నట్లు వివరించారు. నూజివీడు ఆర్‌టిసి డిపో మేనేజర్ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు చించినాడలో అమరవీరుల 75వ వర్ధంతి సభ

పాల్గొనున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర, జిల్లా నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి

ఈ నెల 29న చించినాడ అమరవీరుల స్మారక స్తూపం వద్ద అమరవీరుల 75వ వర్ధంతి సభను నిర్వహించనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదల పక్షాన నిలబడి 1941-51 మధ్యకాలంలో భూస్వామ్య గుండాలు, పోలీసు తూటాలకు బలైన మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన అమరులైన ఆర్.గోపాలరాజు, అయ్యప్పరాజు, బూసి వెంకట్రావు, బూసి ముసలయ్య, అల్లూరి రామరాజు, 1977-80 మధ్యకాలంలో వీరవల్లి నారాయణ, యాండ్ర సత్యనారాయణ, పంతగాని సూరన్న, కలగంపూడి గ్రామానికి చెందిన గుబ్బల రామలింగయ్య, కాజ గ్రామానికి చెందిన అనిశెట్టి కాళిదాసు, గుబ్బల సాంబమూర్తి, అనంతర కాలంలో అమరులైన వారిని స్మరించుకుంటూ నిర్వహించే ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, సీనియర్ నేత కేతా సూర్యారావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, సిపిఎం నాయకులు బాతిరెడ్డి జార్జి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సభలో సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు రచించిన 'చించినాడ సమరశీల పోరాట చరిత్ర' అనే పుస్తకాన్ని నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ సభలో కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వణుదుర్రులో ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు

తాగునీటి చెరువుకు ముప్పు
పనులను అడ్డుకున్న గ్రామస్తులు


మట్టి తవ్వకం పనులను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

రెండు పంటలు పండే పచ్చని పంట పొలాలను బడా బాబులు ఆక్వా చెరువులుగా మారుస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా పంట పొలాలను ఆక్వా చెరువులుగా తవ్వుతున్నారు. మండలంలోని వణుదుర్రు గ్రామంలో గత మూడు రోజులుగా బడాబాబులు గ్రామ రక్షిత మంచినీటి పథకం తాగునీటి చెరువు గట్టును ఆనుకుని రెండు పంటలు పండే పంటపొలాలను అనుమతులు లేకుండా ఆక్వా చెరువులుగా మార్చేందుకు తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు గ్రామ సర్పంచి చిన్నం సుగుణబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఆక్వాచెరువు తవ్వకం పనులను అడ్డుకుని పనులు నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొందరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా, ఎవరికి తెలియకుండా సుమారు 18 ఎకరాల్లో చెరువు తవ్వకాలు చేస్తున్నారన్నారు. గతంలో కూడా ఇదే మాదిరిగా తాగునీటి చెరువు వద్ద ఆక్వా చెరువులు తవ్వుతుంటే అడ్డుకున్నామన్నారు. అప్పట్లో నిలుపుదల చేసి ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ ఇప్పుడు తవ్వకాలు చేపట్టారన్నారు. ఆక్వా చెరువు తవ్వకాల వల్ల తాగునీటి చెరువు కలుషితమవుతుందన్నారు. తామంతా పంచాయతీ కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటిని తాగుతున్నామని గ్రామస్తులు చెప్పారు. వణుదుర్రు, కొత్తపల్లి రెండు గ్రామాలకు చెందిన రెండు వేల పైచిలుకు జనాభాకు ఈ మంచినీటి చెరువు నుంచి తాగు నీరు సరఫరా అవుతుందన్నారు. ఆక్వా చెరువు తవ్వితే ఊట మంచినీటి చెరువులకు దిగి తాగునీరు పాడవుతుందన్నారు. పంట కాలువ ఏదారిలో ఏదు మాసాలు మాత్రమే వస్తుందన్నారు. మిగతా ఐదు నెలలు గ్రామస్తులంతా ఆక్వా చెరువు ఊట నీళ్లే తాగాల్సిన దుస్థితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఐదు పొక్లెయిన్లను నిలుపుదల చేశామని చెప్పారు. తవ్వకం పనులు నిలుపుదల చేసిన ఆక్వా చెరువులో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేసి విడగొట్టి ఆక్వా చెరువులు తవ్వకుండా అధికారులు చూడాలన్నారు. ఇప్పటికే ఈ విషయంపై తహశీల్దార్ లతీఫ్ భాషా, ఎంపిడిఒ రామకృష్ణలకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆక్వా చెరువు తవ్వకం దా చూసేందుకు ఇద్దరు వ్యక్తులను కాపలా పెట్టామన్నారు. మంచినీటి చెరువును ఆనుకుని ఆక్వా చెరువు తవ్వరాదంటూ పంచాయతీ పాలకవర్గ సభ్యులతో పంచాయతీ తీర్మానం చేసినట్లు సర్పంచి సుగుణబాబు తెలిపారు. సంబంధిత శాఖాధికారులు వెంటనే స్పందించి చెరువులో నిలుపుదల చేసి ఉన్న ఐదు పొక్లెయిన్లను బయటకు పంపించాలనిగా గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

క్రీడాకారులకు మంత్రి పార్థసారథి అభినందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణ పరిధిలోని శ్రీ మాదపాటి వెంకటేశ్వరరావు పంతులు విటిపిఎచ్ గ్రౌండ్స్‌కు చెందిన క్రీడాకారులు ఉమ్మడి కృష్ణా జిల్లా, రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వారిని శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముసునూరు మండలం రమణక్కపేట జెడ్‌పి హైస్కూలులో బాస్కెట్ బాల్ క్రీడలో శిక్షణ పొందే బొత్సాహిక క్రీడాకారుల కోసం సిమెంట్ కోర్టు ఏర్పాటు చేయిస్తామన్నారు. నూజివీడు క్రీడాకారులు బాస్కెట్ బాల్ పోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయి దాటి జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచడం పట్ల ప్రశంసించారు. క్రీడాకారులకు ప్రశంస ధ్రువీకరణ పత్రాలు అందించి ఘనంగా సన్మానించారు.

ప్రజాసంఘాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల కేంద్రంలో సోయం గంగులు ఆదివాసీ భవన (ప్రజాసంఘాల భవనం) నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసినట్లు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ తెలిపారు. రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, రాష్ట్ర సెక్రటరీ సభ్యులు బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి రవి జెండా ఆవిష్కరించి భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంతెన సీతారాం, బి.బలరాం, రవి మాట్లాడుతూ పోరాటాల కేంద్రమైన జీలుగుమిల్లిలో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు మొడియం నాగమణి, బుట్టాయగూడెం, పోలవరం మండల కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, భాస్కర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య, సిహెచ్.కొండలరావు, గుడెల్లి వెంకట్రావు, కారం మల్లుదొర, శేషగిరి, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కొనె సీతారామారావు, ఆయన ప్యానల్ ఉదోగ్య ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ హాలులో అడ్వకేట్స్, అభిమానులు, శ్రేయోభిలాషుల మధ్య శుక్రవారం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా ఎన్నికైన కొనె సీతారామారావు, ఆయన ప్యానెల్ అంతా ఒక్కొక్కరుగా ప్రమాణం చేశారు. నూతన కార్యవర్గాన్ని తోటి అడ్వకేట్స్, అభిమానులు పూల మాలలతో, శాలువాలతో అభినందించారు. బార్ అసోసియేషన్ భవన విద్యుత్ సర్వీస్ పునరుద్దరణకు అధ్యక్షుడు కొనె సీతారామారావు రూ.ఒక లక్ష ప్రకటించగా, అడ్వకేట్స్ పెనుమెత్స ఏలూరి వెంకటేశ్వరరావు రూ.50 వేలు, ఎ.వి.నారాయణ రూ.25 వేలు ఆర్థిక సహకారం అందించారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

అధికారులకు ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు ఆదేశం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా నిర్మూలనకు కృషి చేయాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మలేరియా అధికారులను ఆదేశించారు. ఆయనను బర్రింకలపాడులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో కోట రామచంద్రాపురంలో ఉన్న మలేరియా కార్యాలయ ఉద్యోగులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరులో ఉన్న మలేరియా అధికారి కార్యాలయాన్ని ఏజెన్సీ ప్రాంతంలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా నిర్మూలనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్, ఎంపిహెచ్ఇఒ పి.శ్రీనివాసరావు, బుట్టాయగూడెం సబ్ యూనిట్ అధికారి నరేష్ బాబు, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరానికి చెందిన పదో తరగతి విద్యార్థి భావన నాలుగు రోజుల క్రితం ఇంటిలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో తీవ్రంగా గాయపడింది. తాడేపల్లిగూడెం ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పారు. చికిత్స కోసం రూ.నాలుగు లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. బాలిక తండ్రి అప్పన్న ఆందుగా నిలిచాడు. మిత్రులు, పూర్వ విద్యార్థులు రూ.50 వేలు సేకరించి శుక్రవారం అందించారు. ఇపుడులో ఉన్న మిత్రుడి కుమార్తె వైద్య ఖర్చులకు సాయం అందించిన మిత్ర బృందాన్ని పలువురు అభినందించారు.

టిడిపి మండలాధ్యక్షులుగా రఘుబాబు

రఘుబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి మండల అధ్యక్షులుగా గద్దె రఘుబాబును ఎన్నుకున్నట్లు మాజీ మండలాధ్యక్షులు దేవినేని దలరామ్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో పార్టీ మండలాధ్యక్ష పదవి నియామకానికి ఎన్నిక నిర్వహించగా గద్దె రఘుబాబును ఎన్నుకున్నట్లు పరిశీలకులు తెలిపారు. గత 20 ఏళ్ల నుంచి పార్టీకి ఎనలేని సేవలందించిన రఘుబాబు మండలంలోని ప్రతిఒక్కరూ ఆయనను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - దెందులూరు

గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో క్రమశిక్షణతో మెడికల్ షాపులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న ది ఏలూరు రూరల్ ఏరియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సంఘ సభ్యులకు తాను ఎల్లప్పుడూ అన్నివిధాలా అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఆయనను పెదవేగి మండలం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ది ఏలూరు రూరల్ ఏరియా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు, సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఎల్ఎకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు, సభ్యులతో సావధానమైన ఎంఎల్ఎ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేలా, అసోసియేషన్ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించేలా చర్యలు చేపడతానని భరోసా ఇచ్చారు.

అనాథలకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

పిఎస్.వరకుమార్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రేషన్‌కార్డుల మంజూరులో ప్రభుత్వం నిబంధనలను సవరించి అర్హులైన అనాథలందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేసి వారి జీవనప్రమాణాలను పెంపొందించడంలో తోడ్పాటును అందించాలని కాసా జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ పూర్వపు రీజనల్ కో-ఆర్డినేటర్ పిఎస్.వరకుమార్ కోరారు. ఈ మేరకు సిపిఐ సంఘాల నాయకుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు లేఖలు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సంరక్షణ కేంద్రాల్లో, సంరక్షకుల వద్ద ఆశ్రయం పొందుతున్న 18 ఏళ్ల నిండిన అనాథలందరికి ప్రత్యేక రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. చిన్న చిన్న దుకాణ సేవకు తీసుకుని నామమాత్రపు అద్దెలుసున్న రిటర్న్, విద్యుత్ వాడకాన్ని పరిగణలోనికి తీసుకోకుండా రేషన్‌కార్డుల ప్రక్రియ జరిగేలా చూడాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

జంగారెడ్డిగూడెం: ట్రాక్టర్ ఇటుక లోడుతో వెళ్తుండగా గోతిలో పడి ట్రక్కు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ఉన్న ఇద్దరు ముగ్గురు కూలీలు స్వల్పగాయాలపాలయ్యారు. ఈ ఘటన జంగారెడ్డిగూడెంలో పట్టణంలోని ఏలూరు రోడ్డులో శుక్రవారం చోటు చేసుకుంది. రోడ్డు అధ్వానంగా ఉండడంతో గోతిలో పడి ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడిందని డ్రైవర్ చెబుతున్నారు. ప్రమాదంలో తాము దూకేయడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డామని స్వల్పగాయాలపాలైన కూలీలు తెలిపారు. జంగారెడ్డిగూడెంలో రహదారులన్నీ అధ్వానంగా ఉన్నాయని, వీటిపై త్వరగా మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రభుత్వ బడిలో చేరిన విద్యార్థికి రూ.ఐదు వేలు

ప్రజాశక్తి - మండవల్లి

అయ్యవారి రుద్రవరం హరిజనవాడకు చెందిన ప్రయివేట్ పాఠశాలలు వెళ్లే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరితే ప్రతి విద్యార్థికి రూ.ఐదు చొప్పున ఆర్థిక సాయం అందిస్తానని అయ్యవారి రుద్రవరం సర్పంచి బొంగం శేషగిరి ప్రకటించి ప్రభుత్వ పాఠశాలలపై ఆయనకు ఉన్న మక్కువను చాటారు. అయ్యవారి రుద్రవరం హరిజనవాడలోని ఎంపిపి పాఠశాలలోని విద్యార్థులకు నిర్వహించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఈ ప్రకటన చేశారు. దీంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సేవ చేసేందుకు 'మానవత' మంచి వేదిక

ప్రజాశక్తి - చింతలపూడి

సేవ చేయటానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మంచి అవకాశమని ఆ సంస్థ అధ్యక్షులు ఎడ్లపల్లి శ్రీను అన్నారు. సంస్థ చింతలపూడి శాఖ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మండలంలోని మద్దిముక్కన్నగూడెంలో శుక్రవారం కనుమత రెడ్డి రాజేశ్వరి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షులుగా ఎడ్లపల్లి శ్రీను, ఉపాధ్యక్షులుగా బిబిఎస్ఎన్.రాజు, కార్యదర్శిగా మన్యం సత్యకుమార్, ఉప కార్యదర్శిగా టి.విద్యానంద్, కోశాధికారిగా జల్లిపల్లి విశ్వేశ్వరరావు, మెంబర్లుగా ముక్కు అప్పారావు, గండ్ర వేమారెడ్డి, తాటికొండ శ్రీను, కె.సురేంద్ర ఎన్నికయ్యారు. అనంతరం వీరందరూ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కర్, జిల్లా డైరెక్టర్ బోర్డ్ ఛైర్మన్ రామిరెడ్డి గంగాధర్, చింతలపూడి ఛైర్మన్ ఆర్వేపల్లి అప్పారావు, గౌరవ డైరెక్టర్ అన్నవరపు సత్యనారాయణ, జిల్లా సంయుక్త కార్యదర్శి పుల్లారు సోమశేఖర ఆచార్యులు, కన్వీనర్ కాండ్రేగుల నాగ చిన్నారావు, ఎంపిటిసి సభ్యులు ఎం.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మాదక ద్రవ్య వినియోగ రహిత దేశంగా మన దేశాన్ని మార్చడమే నషా ముక్త్ భారత్ అభియాన్ ఉద్దేశమని, యువత మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉంటూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని నూజివీడు ఎక్సైజ్ సిఐ పి.విజయకుమారి అన్నారు. ఆగిరిపల్లిలో ఎక్సైజ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి బాలబాలికలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించి, మెయిన్ సెంటర్లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి సెక్టార్ ఎక్సైజ్ సూపర్వైజర్ జి.రాగమయి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై దిగబడిన లారీ

గంటలు తరబడి నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అప్పలరాజుగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్లే ఆయిల్‌పామ్ గెలల లోడు లారీ శుక్రవారం అప్పలరాజుగూడెం సమీపంలో రోడ్డుపై గోతుల్లో దిగబడింది. దీంతో గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీంతో దిగబడిన లారీని తీయడానికి వచ్చిన లారీ కూడా పాడవడంతో నాలుగు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికుల చొరవతో దిగబడిన లారీ తీసి రాకపోకలను పునరుద్ధరించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని టిడిపి గ్రామ అధ్యక్షులు చలమాల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని లోపూడి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లలో భాగంగా మూడు జతల యూనిఫామ్, పుస్తకాలు, బ్యాగులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు వెంకయ్య, టిడిపి నాయకులు వేంపాటి శ్రీనివాసరావు, లక్ష్మణ కాంతారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని గొల్లపల్లిలో శ్రీ భాను స్మైల్ దంత వైద్యశాల వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్య నిపుణులు దేవిశెట్టి దినేష్ మాట్లాడుతూ దంతాల పరిరక్షణతో గుండె జబ్బులు దరి చేరవన్నారు. కేవలం నిమిషాల వ్యవధిలోనే దంత దావాల కొనసాగించాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు కూడా దంతసిరికి ఎంతగానో దోహదపడతాయని వివరించారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

ప్రజాశక్తి - దెందులూరు

గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మేకలు, గొర్రెలలో నట్టల నివారణ మందుల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం పెదవేగి మండలంలోని భోగాపురంలో ఆయన ప్రారంభించారు. ఈ నెల 26వ తేదీ నుంచి జులై పదో తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

5వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

తరుగుమూల ఇళ్లస్థలాల లబ్ధిదారులకు వ్యవసాయ కార్మిక సంఘం సంఘీభావం

దీక్షల్లో ఇళ్ల స్థలాల లబ్ధిదారులు

ప్రజాశక్తి - మండవల్లి

పోలీస్ స్టేషన్‌కు అనువైన ప్రాంతం ఉన్నప్పటికీ పేదల ఇళ్ల స్థలాల్లోనే పోలీస్ స్టేషన్ నిర్మించాలని అనుకోవడం దుర్మార్గమైన చర్యని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మహంకాళరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణం వద్దంటూ లబ్ధిదారులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో ఐదో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరానికి చేరుకున్న ఆయన లబ్ధిదారులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. రెవెన్యూ కార్యాలయాల వద్ద పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు అనువైన ప్రాంతం ఉన్నప్పటికీ గ్రామంలో పోలీస్ స్టేషన్ నిర్మించకుండా ఊరికి కిలోమీటర్ దూరంలో పేదల ఇళ్ల స్థలాల్లో నిర్మించాలనుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. 20 ఏళ్లుగా సొంతింటి కల కోసం ఎదురు చూసి ఎదురుచూసి లబ్ధిదారులు ఎంతో నష్టపోయారని, ఇంకెత నష్టపోవాలంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోలీస్‌స్టేషన్ ప్రజలకు అందుబాటులో గ్రామంలోనే రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసి పేదల ఇళ్ల స్థలాలను మెరక చేసి ప్రభుత్వమే ఇల్లు కట్టించాలనే ప్రధాన డిమాండ్ చేశారు. లేకుంటే పేదల పక్షాన సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింహాచలం, వర్ధి, వెంకటరమణ, లీలావతి, చిన్ని, వెంకటేశ్వరమ్మ, రమణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

రోడ్డుపై పొంగుటూరువాసుల ఆందోళన

ఆందోళన చేస్తున్న పొంగుటూరువాసులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పొంగుటూరు-ఎర్రగూడెం గ్రామాల మధ్య 15 కిలోమీటర్ల మేర ఉన్న రహదారిపై భారీ గోతులు పడి ప్రమాదకరంగా మారిందని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పొంగుటూరు గ్రామస్తులు కోరారు. ఈ మేరకు అధ్వానంగా ఉన్న రహదారిపై శుక్రవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి అధ్వానం కావడానికి గ్రీన్ ఫీల్డ్ హైవే వాహనాలు పరిమితికి మించి మెటీరియల్ రవాణా చేస్తుండడం ప్రధాన కారణమన్నారు. గోతుల కారణంగా స్కూల్ బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయని యాజమాన్య వారు రాకపోకలు నిలిపివేయడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, పలు వాహనాలు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి రహదారి అభివృద్ధి చేపట్టాలని కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలు చేపట్టిన ఆందోళనకు రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ ఆందోళనలో మద్దాల రత్నం, జి.దుర్గ, గేలం లక్ష్మి, నేలపోగుల రాజకృష్ణ, కొమ్మన శ్రీనివాస్, ఎర్రమెక్క నాగ సుబ్బారావు, గేలం శ్రీరామకృష్ణ, శీలం మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం డిగ్రీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

ఎపి పీజీ ఎంట్రన్స్, సెంట్రల్ యూనివర్సిటీలో ర్యాంకులు


ర్యాంకర్లను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ఎస్ఎవిఎస్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఎపి పీజీ కోర్సులకు రెండు వారాల క్రితం జరిగిన ఎంట్రన్స్ పరీక్షల్లో ర్యాంకులు సాధించారని ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు వెల్లడించారు. శుక్రవారం కాలేజీలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎపి సెట్ ఎంట్రన్స్ పరీక్షల్లో ఎంఎస్‌సి ఫిజిక్స్‌లో శీతల లిఖితారాణి స్టేట్ 21వ ర్యాంకు సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఎం.శ్రీనాథ్ 155 ర్యాంకు, ఎంఎస్‌సి జువాలజీలో కె.దేవి 311 ర్యాంకు పొందారని చెప్పారు. సెంట్రల్ యూనివర్సిటీ పరీక్షల్లో ముత్యం చందు అఖిలభారత స్థాయిలో 5676వ ర్యాంకుతో పాటు ఎపి పీజీలో సైతం ర్యాంకు పొందటం సంతోషంగా ఉందన్నారు. ముత్యం చందు పేద విద్యార్థి కావడంతో రిజిస్ట్రేషన్ కోసం చెల్లించాల్సిన ఫీజులకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడన్నారు. ఆ విద్యార్థికి ఆర్థిక సాయం ఇచ్చే దాతలు 9951405034 నెంబర్‌కు ఫోన్ చేసి చేయాలని కళాశాల అభివృద్ధి, ప్రణాళిక సంఘం సభ్యుడు బొమ్మిడి అప్పారావు విజ్ఞప్తి చేశారు. పలువురు అధ్యాపకులు ఆర్థిక సాయం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు.

స్త్రీనిధి సద్వినియోగంపై బీహార్ బృందం అధ్యయనం

ప్రజాశక్తి - ఉంగుటూరు

డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి, బ్యాంకు లింకేజ్ రుణాలు ఎలా సద్వినియోగం అవుతున్నాయో పరిశీలించే అధ్యయన బృందం బాదంపూడిలో పర్యటించింది. ఇక్కడి అమలు తీరును అధ్యయనం చేసిన తమ రాష్ట్రంలో అమలు చేసేందుకు బీహార్ నుంచి బీహార్ రూరల్ లైవ్లీ హుడ్ ప్రమోషన్ సొసైటీ బృందం వచ్చినట్లు మండల ఎపిఎం ప్రభావతి శుక్రవారం తెలిపారు. రుణాలు తీసుకుని పూతరేకులు, ఇతర స్వీట్స్ తయారీ చేసి మార్కెటింగ్ చేస్తూ లాభాల బాటలో పయనిస్తున్న గ్రూపు సభ్యులతో బీహార్ బృందం మాట్లాడింది. బీహార్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ సంజయ్ మిశ్రా, డిస్ట్రిక్ మేనేజర్ ఆచార్య మమ్మత్, వసీం అన్సారి, జోనల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సునీత, ఎజిఎం చెన్నకేశవులు, స్త్రీ నిధి మేనేజర్ నరేంద్ర పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటుకు మంత్రి హామీ

రమణక్కపేట జెడ్‌పిహెచ్ స్కూల్ హెచ్‌ఎం రామకృష్ణ

ప్రజాశక్తి - ముసునూరు

రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాస్కెట్‌బాల్ కోర్టును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం పివిఎస్.రామకృష్ణ తెలిపారు. మం డలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను నూజివీడులో మంత్రి శుక్రవారం అభినందించారన్నారు. ఈ క్రమంలో బాస్కెట్ బాల్ కోర్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజు ఆధ్వర్యంలో హామీ ఇచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలోని శక్తి టీమ్స్ బృందాలు ఏర్పడి కళాశాలల విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర నెంబర్ల గురించి వివరించారు. ఆపద సమయాల్లో 112 నెంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా వెంటనే పోలీసుల సహాయాన్ని పొందవచ్చని సూచించారు.

టిడిపిలో గ్రూపు విభేదాలు మరోసారి బహిర్గతం

ఉత్కంఠతల నడుమ సంస్థాగత ఎన్నికల అభిప్రాయ సేకరణ

టి.నరసాపురం :మండలంలో టిడిపి సంస్థాగత ఎన్నికలకు సంబంధించి కమిటీ ఎంపికకై నిర్వహించిన కార్యకర్తల అభిప్రాయ సేకరణ సభ ఉద్రిక్తల మధ్య సాగింది. దీంతో మండలంలో టిడిపిలో రెండు గ్రూపుల మధ్య విభేదాలు మరోసారి బహిర్గతం అయ్యాయి. కొంతకాలంగా మండలంలో టిడిపి నాయకుల మధ్య గ్రూపు పోరు కొనసాగుతుండగా ఇటీవల గ్రామ కమిటీల ఎంపిక విషయంలో ఆధిపత్యం కోసం ఇరు గ్రూపుల నాయకులు పోటీ పడ్డారు. దీంతో గ్రామ కమిటీల ఎంపికకు జిల్లా, రాష్ట్ర నాయకత్వం అబ్జర్వర్లను నియమించడంతో పోలవరం నియోజకవర్గ అబ్జర్వర్ మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహనరావు, వెంకటనారాయణ, మండల అబ్జర్వర్ గుత్త వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్ఎస్ కళ్యాణమండపంలో కమిటీల ఎంపికకు కార్యకర్తల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని 15 పంచాయతీల నుంచి టిడిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అబ్జర్వర్లు ఒక్కో పంచాయతీ నుంచి కార్యకర్తలను పిలిచి అభిప్రాయాలు సేకరిస్తున్న క్రమంలో కార్యకర్తల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. కొంతసేపు తోపులాట కూడా జరగగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో కార్యకర్తలను సముదాయించి అభిప్రాయ సేకరణ కొనసాగించారు. అబ్జర్వర్లు 15 పంచాయతీల నుంచి బందంచర్ల, బందంచర్ల, కేతవరం తప్ప మిగిలిన 12 పంచాయతీల్లో అభిప్రాయ సేకరణ పూర్తి చేసినట్లు మాజీ ఎంపిటిసి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు.

9న సమ్మెలో పాల్గొనున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రోజుకు పది గంటల పని విధానం రద్దు చేయాలని, ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ జులై తొమ్మిదో తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు కూడా పాల్గొంటున్నారని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర కమిటీ తెలిపింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు శుక్రవారం సమ్మె నోటీసు సమర్పించింది. ఈ సందర్భంగా ఆ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ జులై తొమ్మిదో తేదీన జరిగే సమ్మెలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు, కార్యదర్శి అంగులూరు జానుబాబు, ఉపాధ్యక్షులు బంగారు వెంకటేశ్వరరావు, ఆంథోని పాల్, ప్రసాద్, దుర్గారావు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు తల్లికి వందనం వర్తింపజేయాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని తిరుమలదేవిపేట సచివాలయ సిబ్బంది స్థానిక దళిత అంగన్వాడీ కార్యకర్తపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మిగిలిన అన్ని మండలాలు, పంచాయతీల్లో అంగన్వాడీ కార్యకర్తలకు తల్లికి వందనం ఆన్‌లైన్ చేశారని, తిరుమలదేవిపేట పంచాయతీలోని సచివాలయ సిబ్బంది అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్‌పై విచారణ చేసి చర్యలు చేపట్టి అంగన్వాడీ కార్యకర్తలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

సర్టిఫికెట్ పోయినది

ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, పాసుకుమడు గ్రామానికి చెందిన మేనేని ధర్మ వీర వెంకట నాగ సత్య సాయి S/o దుర్గారావు అను నా యొక్క SSC ఒరిజినల్ సర్టిఫికేట్ పోయినది. సర్టిఫికెట్ నెం. జూన్-2023, Roll.No. 2311604734, గల SSC ఒరిజినల్ సర్టిఫికేట్ ను ది. 21-06-2025వ తేదీన నా ప్రయాణం ఆయిన పాసుకుమడు నుండి ఏలూరు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో పడిపోయినది. ఎంత వెతికిన దొరకలేదు. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మేనేని ధర్మ వీర వెంకట నాగ సత్య సాయి
S/o: దుర్గారావు
పాసుకుమడు,
చింతలపూడి మండలం,
ఏలూరు జిల్లా,
సెల్ నెం: 93466 24034

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, సిద్ధాంతం గ్రామానికి చెందిన కాలాబత్తుల గ్లోరి, భర్త : రాజారత్నం అను నేను నా యొక్క పాస్‌పోర్ట్ పోయింది. సిద్ధాంతం ఇంటి దగ్గర నుండి నెట్ సెంటర్‌కు వెళ్తుండగా నా యొక్క పాస్‌పోర్ట్ నంబర్ : M2385738 గల పాస్‌పోర్ట్ పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

కాలాబత్తుల గ్లోరి
భర్త: రాజారత్నం
డోర్ నెం: 2-81, సిద్ధాంతం
పెనుగొండ మండలం,
ప.గో.జిల్లా, పిన్: 534326
సెల్ నెం: 75691 00097

డాక్యుమెంట్స్ పోయినవి

ఏలూరు జిల్లా, నిడమర్రు మండలం, అడవికొలను గ్రామానికి చెందిన మాకిరెడ్డి దుర్గాప్రసాద్ S/o. సత్యనారాయణ అను నా యొక్క ఒరిజినల్ రిజిస్టర్ సేటిల్‌మెంట్ డీడ్ పోయినది. ఒరిజినల్ డీడ్ నెం.5248/2023. Dated 29-04-2022 ది. 20-06-2025వ తేదీన గణపవరం నుండి భీమవరం వెళ్ళుచుండగా దారి మధ్యలో నా యొక్క 5248/2023. నెంబరు గల ఒరిజినల్ రిజిస్టర్ సెటిల్‌మెంట్ డీడ్ పడిపోయినది. ఎంత వెతికిన దొరకలేదు. ఎవరైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మాకిరెడ్డి దుర్గాప్రసాద్
S/o: సత్యనారాయణ
అడవికొలను,
నిడమర్రు మండలం, ఏలూరు జిల్లా
సెల్ నెం: 83330 37545

PUBLIC NOTICE

IN THE COURT OF THE IIND ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION), ELURU. W.G. DISTRICT.

O.S.No. 339/2024

Between:

Vadlapatla Vimala Devi ... **plaintiff**

And

Nunna Srilakshmi & Ors

...**Defendants**

To,

D7- Mareedu Kondala Rao,
S/o. Mareedu Rama Sastrulu,
D.No.1-143, Satrampadu,
Eluru, Eluru District.

Whereas, the plaintiff has filed suit for recovery of the amount due under the suit mortgage, whereas the Hon`ble Court ordered notice to your appearance. Therefore, you are called upon to appear before the Hon`ble Court on 30-06-2025 at 10.30 A.M., and state your objections if any, alse the matter will be decided in your absence.

PYDI VENKATA RAJU,

Eluru | Advocate, Eluru
Date: 27-06-2025 | Cell: 98851 99811